# సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 7 । డిసెంబర్ । 2023




## న్యూస్‌రీల్

### ఆర్తాంలో ఏనుగుల గుంపు సంచారం



ఆర్తాం గ్రామ సమీపంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాల్లో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు బుధవారం ఆర్తాం గ్రామ పరిసరాల్లోకి చేరింది. గజరాజులకు సమీపంలో అంతఃరాష్ట్ర రహదారి, రైల్వే లైన్లు ఉండడంతో ప్రమాదానికి గురికాకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఏనుగులను కవ్వించవద్దని స్థానికులకు సూచించారు.

### సువర్ణముఖిలో నిలకడగా నీటి ప్రవాహం



కొత్తవలస డ్యామ్ వద్ద సువర్ణముఖి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్.వి.రమణ, ఇరిగేషన్ అధికారులు

సీతానగరం: సువర్ణముఖి నదిలో నీటి ప్రవాహం నిలకడగా ఉందని తహసీల్దార్ ఎన్.వి.రమణ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ ఎస్.సోమేశ్వరరావు, ఈఓపీఆర్డీ కె.కుమావర్మతో కలిసి సువర్ణముఖి నదిపై కొత్తవలస వద్దను డ్యామ్‌ను బుధవారం పరిశీలించారు. నదికి ఇరువైపులా రైతులు సాగుచేసిన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారి సతీష్‌కుమార్, ఇరిగేషన్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

### సరుకుల సరఫరాకు టెండర్లు



టెండర్లు నిర్వహిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వివిధ గిరిజన విద్యాసంస్థలకు కావాల్సిన వస్తుసామగ్రి సరఫరాకు జీసీసీ ఆధ్వర్యంలో బుధవారం టెండర్ ప్రక్రియ నిర్వహించారు. పీఓ కల్పనాకుమారి సమక్షంలో కందిపప్పు, నూనెలు, మినపప్పు, శనగపప్పు, బన్సీ, ఇడ్లీరవ్వ, గోధుమపిండి, శనగపలుకులు, కారం, పసుపు, బెల్లం, రాగిపిండి, కోడిగుడ్లు తదితర 34 రకాల సరుకుల సరఫరాకు నిర్వహించిన టెంటర్ల ప్రక్రియకు 9 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు, డీడీ మంగవేణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, గురుకుల సెల్‌ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

### కేజీబీవీ బోధకుల్లో వేతన ఆనందం



కేజీబీవీలో బోధిస్తున్న పీజీటీ

విజయనగరం అర్బన్: అనాథలు, పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ)ను అందుబాటులోకి తెచ్చారు. వేలాది మంది అనాథలు, పేద పిల్లల్లో విద్యావెలుగులకు బాటలు వేశారు. కేజీబీవీలలో పదోతరగతి పూర్తయిన తర్వాత బాలికలు చదువుకు దూరంకారాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి కేజీబీవీల్లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. కేజీబీవీలలో పనిచేసే ప్రిన్సిపాల్, సీఆర్‌టీలు, పీఈటీలకు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం జూన్ నెల నుంచి వేతనాలు పెంచారు. ప్రిన్సిపాల్‌కు రూ.27,755 ఉండే వేతనాన్ని రూ.34,139కు, అలాగే, సీఆర్‌టీలకు రూ.21,755 నుంచి రూ.26,759కి, పీఈటీలకు రూ.21,755 నుంచి రూ.26,759కి పెంచారు. ప్రస్తుతం పీజీటీలకు కూడా తాజాగా రూ.12 వేలు నుంచి ఒకేసారి రూ.26,759లు చేశారు. ఖాళీగా ఉన్న 51 పీజీటీ పోస్టులు, ఐదు ప్రిన్సిపాల్ పోస్టులను సైతం భర్తీ చేశారు. వీరందరికీ ఈ ఈ నెల 1 నుంచే పెంచిన జీతాలు వర్తింప జేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయంతో విజయనగరం జిల్లాలో 87 మందికి ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

# జోరువాన

- తీరం దాటాక జిల్లాపై 'మిచాంగ్' ప్రభావం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు
- పొలాలకు పరుగుతీసిన వ్యవసాయ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది
- పంట రక్షణ చర్యలపై రైతులకు సూచనలు
- ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించిన ముందస్తు చర్యలు
- నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు



సాలూరు: బంగారమ్మపేట సమీపంలో పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: తీరం దాటాక పార్వతీపురం మన్యం జిల్లాపై 'మిచాంగ్' ప్రభావం కనిపించింది. తుపాను ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు కొన్నిచోట్ల భారీ, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజుల్లో సగటున 658 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పల్లపు పొలాల్లోని వరి చేనును ముంచేసింది. వరి కుప్పలు తడిసిముద్దయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. పొలాలకు వెళ్లి రైతులకు పంటరక్షణ చర్యలను వివరించారు.



పాలకొండ: వడమ గ్రామ సమీపంలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పొలాల్లోని నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారు. నష్టం అంచనాలు వేయడంలో నిమగ్నమయ్యారు.

- తుపాను కారణంగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బలిజిపేట, గరుగుబిల్లిలో చిన్నచిన్న ఆటంకాలు కలిగినప్పటికీ తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి అమర్చారు.
- తుపాను ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శాఖాధికారులు జిల్లా వ్యాప్తంగా 30 వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందించారు. వర్షాలతో వ్యాప్తిచెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు.
- కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు రైతులు నూర్పిడిచేసిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేశారు. ధాన్యం తరలింపు, రైతులకు సహాయక చర్యలు అందించడంపై సివిల్ సప్లై ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మిల్లర్ల సమావేశంలో ఆర్డీఓ హేమలత పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణపై దిశానిర్దేశం చేశారు.



కొమరాడ: విక్రంపురంలో నేలకొరిగిన వరి పంట పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శంకరరావు, తదితరులు

### నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ప్రభుత్వ ఆదేశాల మేరకు తుపాను కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా సోమ, మంగళ, బుధవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తుపాను వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



గరుగుబిల్లి మండలంలో విద్యుత్ స్తంభం మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

### జిల్లాలో తుపాను నష్టం (ప్రాథమిక అంచనా) ఇలా..

- 134 హెక్టార్లో వరి పంటకు నష్టం
- పాక్షికంగా దెబ్బతిన్న ఒక పూరిగుడిసె
- రోడ్ల పాక్షిక నష్టం అంచనా రూ. 2లక్షలు, తీవ్రనష్టం రూ.10లక్షలు
- పార్వతీపురం పరిధిలో కల్వర్టు డామేజీ (రూ.5.50 లక్షలు)
- పాలకొండ పరిధిలో 35 విద్యుత్ స్తంభాల నష్టం (రూ.58 వేలు)
- పార్వతీపురం పునరుద్ధరణ ఖర్చు రూ.10 లక్షలు
- సాలూరులో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల ఖర్చు రూ. 2లక్షలు

| జిల్లాలో బుధవారం నమోదైన వర్షపాతం వివరాలు | |
|---|---|
| మండలం | నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో) |
| వీరఘట్టం | 23.0 |
| సీతంపేట | 19.0 |
| భామిని | 19.0 |
| పాలకొండ | 26.6 |
| కొమరాడ | 38.8 |
| గుమ్మలక్ష్మీపురం | 19.8 |
| కురుపాం | 26.0 |
| జియ్యమ్మవలస | 28.0 |
| గరుగుబిల్లి | 41.0 |
| పార్వతీపురం | 55.2 |
| మక్కువ | 60.4 |
| సీతానగరం | 35.4 |
| బలిజిపేట | 50.0 |
| సాలూరు | 72.0 |
| పాచిపెంట | 61.2 |

### తుపాను సహాయక చర్యల్లో వలంటీర్లు



జోరువానలోను గిరిశిఖర పట్టుచెన్నేరులో ప్రజలకు సూచనలిస్తున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

సాలూరు: తుపాను సహాయక చర్యలు అందించడంలో గ్రామ, వార్డు వలంటీర్లు సైనికులుగా మారారు. గిరిశిఖర, ముంపు ప్రాంతాల్లో పర్యటించి ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో సాయమందించారు.

## రైతన్నకు అండగా ప్రభుత్వం

పార్వతీపురం: రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రైతులకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించాలని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను బుధవారం ఆదేశించారు. పంట పరిరక్షణపై జిల్లా యంత్రాంగం పూర్తి దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నర్సరీ దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయాలని సూచించారు. పంట నష్టాన్ని అంచా వేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నిషాంత్‌కుమార్ వివిధ శాఖల అధికారులతో తుపాను ప్రభావంపై సమీక్షించారు. పంట పరిరక్షణ చర్యలను రైతులకు వివరించాలని వ్యవసాయ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, పశుసంవర్ధక శాఖ తక్షణం నష్టాలను అంచనా వేయాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా అధికారులు జి.కేశవనాయుడు, ప్రసూన, బి.జగన్నాథరావు, డా.బి.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

## ఎస్‌ఐలకు బదిలీ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు పోలీస్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేసినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

| జిల్లాలో బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు | | |
|---|---|---|
| ఎస్‌ఐ పేరు | ప్రస్తుత ప్రదేశం | బదిలీ ప్రదేశం |
| బి.శివప్రసాద్ | పాలకొండ పీఎస్ | ఎల్విన్‌పేట పీఎస్ |
| ఎస్ షణ్ముఖరావు | ఎల్విన్‌పేట పీఎస్ | కురుపాం పీఎస్ |
| సీహెచ్ ప్రసాద్ | కురుపాం పీఎస్ | బత్తిలి పీఎస్ |
| వై.అమ్మన్నరావు | బత్తిలి పీఎస్ | గరుగుబిల్లి పీఎస్ |
| ఎన్.ప్రశాంత్‌కుమార్ | బలిజిపేట పీఎస్ | పాలకొండ పీఎస్ |
| వి. పాపారావు | సీసీఆర్‌బీ పార్వతీపురం మన్యం | బలిజిపేట పీఎస్ |
| ఎస్.కె.ఫక్రుద్దీన్ | పాచిపెంట పీఎస్ | సీసీఆర్‌బీ పార్వతీపురం మన్యం |
| పి.నారాయణరావు | పార్వతీపురం టౌన్ పీఎస్-2 | పాచిపెంట పీఎస్ |
| కె.సీతారాములు | కొటియా పీఎస్ | పార్వతీపురం పీఎస్-2 |
| డి.లావణ్య | పార్వతీపురంటౌన్ పీఎస్-1 | దిశ ఉమెన్ సెల్ పార్వతీపురం |
| బి.సంతోషికుమారి | దిశ ఉమెన్‌సెల్, పార్వతీపురం | పార్వతీపురంటౌన్, పీఎస్ -1 |

# పంటల సంరక్షణే ప్రధానం



జియ్యమ్మవలస మండలంలో తుఫాన్ దాటికి నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు

- కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్‌ఎస్‌కే పాత్రో

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తడిసిముద్దయిన పంటలను సంరక్షించుకోవాలని కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్‌ఎస్‌కే పాత్రో రైతులకు సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు, డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ జి.అమృతవీణలతో కలిసి జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి మండలాల్లో తడిసిన వరి, అపరాల పంటలను బుధవారం పరిశీలించారు. 10 నుంచి 15 రోజుల్లో కోతకు వచ్చే వరి పంట నేలరాలి నీట మునిగితే బూజు తెగులు సోకి గింజ రంగుమారే ప్రమాదం ఉందని, వర్షాలు తగ్గిన వెంటనే 1.0 మి.లీ ప్రాపికొనజోల్ లేదా 1.0 గ్రాముల కార్బెండిజం మందును లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. పంట కోతదశలో ఉంటే 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి వరి వెన్నులపై పిచికారీ చేయాలని సూచించారు. వరి పనలు తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణంలో కంకులను ముంచాలని, తర్వాత వాటిని ఆరబెట్టి చిన్న చిన్న కుప్పలుగా వేసుకోవాలని తెలిపారు.

# పారదర్శక ఓటర్ల జాబితాయే లక్ష్యం

- ఈ నెల 9తో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ
- ఈ నెల 2, 3 తేదీల్లో క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు కార్యక్రమం
- రెండు రోజుల్లో స్వీకరించిన క్లైములు 8,428



పార్వతీపురంలో ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలించిన ఆర్డీఓ హెమలత (ఫైల్)




గుమ్మలక్ష్మీపురం పోలింగ్ కేంద్రంలో ఈ నెల 2న ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న బీఎల్‌ఓ

పార్వతీపురంటౌన్: జిల్లాలో పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు కసరత్తు జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. కొత్తగా ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ, మార్పులు, చేర్పుల ప్రక్రియను చురుగ్గా నిర్వహిస్తోంది. అందిన దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరిస్తోంది. ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27న విడుదల చేసింది. ఆ జాబితాలో అభ్యంతరాలను తెలియజేసేందుకు డిసెంబర్ 9 వరకు అవకాశం కల్పించింది. అందిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిషాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు పర్యవేక్షిస్తున్నారు.

**ప్రతి అభ్యంతరం క్షుణ్ణంగా పరిశీలన**

జిల్లా వ్యాప్తంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 16 మండలాల (మెంటాడ మండలంతో కలిపి) పరిధిలో 1,031 పోలింగ్ కేంద్రాలున్నాయి. సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుతున్న ప్రతి అభ్యంతరాన్ని బీఎల్‌ఓలు స్వయంగా ఓటర్ల వద్దకు వెళ్లి నిజమా? కాదా అని పరిశీలిస్తున్నారు. సంతృప్తి చెందిన అనంతరం వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తున్నారు. మార్పులు, చేర్పులు ఏమైనా ఉన్నట్లైతే అధికారులు సవరిస్తున్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

**అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేలా..**

ఈ సారి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు ఎన్నికల యంత్రాంగం శ్రమిస్తోంది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ నెలలో రెండు రోజుల పాటు బూత్ స్థాయిలో క్యాంపులు ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. ఈ ప్రక్రియ సంబంధిత ఈఆర్‌ఓలు పర్యవేక్షించనున్నారు. డోర్ టూ డోర్ సర్వే సమయంలో వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నారు. ముసాయిదా ప్రకటించినప్పటి నుంచి ఈ నెల 3వ తేదీ వరకు 11,133 అభ్యంతరాలు వచ్చాయి. డిసెంబర్ 2, 3 తేదీల్లో రెండురోజులు నిర్వహించిన డ్రైవ్‌లో 8,428 క్లైములు స్వీకరించడం విశేషం.

| జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులు ఇలా.. | | | | | |
|---|---|---|---|---|---|
| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | ఫారం-6 | ఫారం-7 | ఫారం-8 | మొత్తం |
| పాలకొండ | 287 | 825 | 703 | 854 | 2,382 |
| కురుపాం | 268 | 516 | 168 | 210 | 894 |
| పార్వతీపురం | 233 | 1794 | 367 | 347 | 2,508 |
| సాలూరు | 243 | 1420 | 799 | 445 | 2,644 |
| మొత్తం | 1031 | 4,555 | 2,017 | 7,856 | 8,428 |

### ఒకరికి ఐదు క్లైయిమ్‌లకే అవకాశం



ఒక వ్యక్తి ఐదు కంటే ఎక్కువ క్లైయిమ్‌లు ఇవ్వడానికి వీల్లేదు. అలా ఎక్కడైనా ఇస్తే క్రిమినల్ కేసుల పెడతాం. డిసెంబర్ 9వ తేదీలోపు వచ్చే ప్రతి దరఖాస్తు, అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. వచ్చే ప్రతి అభ్యంతరాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలిస్తాం. ఎన్నికల నిబంధనల మేరకు కసరత్తు చేస్తున్నాం.

– జె.వెంకటరావు, డీఆర్వో, పార్వతీపురం మన్యం

### కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ నెల 2, 3 తేదీల్లో బూత్ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు మంచి స్పందన వచ్చింది. ఒకే డోర్ నంబర్లో 10 మంది ఓటర్లు ఉన్నట్లైతే నిశితంగా పరిశీలిస్తున్నాం. ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

## క్లుప్తంగా

### సాయుధ దళాల దినోత్సవానికి విరాళాల సేకరణ



విరాళాలను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: సాయుధ దళాల పతాక నిధికి విరాళాలను సేకరిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆయన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సైనికులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ పోరాటంలో, బొంబాయ్ తాజ్ హోటల్ దురాక్రమణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మన సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తోందన్నారు. సాహసోపేత వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఏడాది డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ విరాళాలను జిల్లా సైనిక సంక్షేమాధికారి విజయనగరం పేరున ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 52065221666, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020931, ఎంఐసీఆర్ 535002017 నందు డిపాజిట్ చేయాలని కోరారు. ఎన్‌సీసీ విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వచ్చి విరాళాలు సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కూలిన పెంకుటిళ్లు



భారీ వర్షానికి కూలిన పెంకుటిళ్లు

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు దత్తిరాజేరు మండలంలోని గొభ్యాం గ్రామంలో రెండు పెంకుటిళ్లు కూలిపోయినట్లు వీఆర్వో అప్పలనాయుడు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన వంగపండు మహేష్, వంగపండు పోలమ్మలకు చెందిన ఇళ్లు కూలిపోయాయని, ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని ఇంటిలో ఉన్న వంట సామగ్రి ధ్వంసమైందని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

### పశువుల పాక కూలి ఆవు మృతి



చనిపోయిన ఆవును పరిశీలిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు, మండల పశువైద్యాధికారి రామరాజు

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గడిచిన మూడు రోజుల విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భోగాపురం మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పాడిరైతు బైరెడ్డి పెంటయ్య తనకున్న ఆవులను పాకలో కట్టాడు. అయితే బుధవారం ఉదయం భారీగా వర్షం కురవడంతో పశువుల పాక కూలి ఒక ఆవు మృతిచెందింది. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చింత బంగార్రాజు, మండల పశువైద్యాధికారి రామరాజు సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించి, ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. నష్ట పరిహారం నిమిత్తం రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### ముద్దాయికి జీవిత ఖైదు, జరిమానా

దత్తిరాజేరు/విజయనగరం క్రైమ్: మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన తెంటు ఈశ్వరమ్మను 2022 ఆగస్టు 13న అదే గ్రామానికి చెందిన పోల ఎర్రంనాయుడు సుత్తితో కొట్టడంతో ఆమె మృతి చెందిన ఘటనలో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.ఐదు వందల జరిమానాను జిల్లా కోర్టు విధించింది. ఈ మేరకు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. అప్పట్లో మృతురాలి తల్లి తౌడమ్మ ఫిర్యాదు మేరకు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. భర్త మృతి చెందిన ఈశ్వరమ్మతో సహజీవనం చేసిన ఎర్రంనాయుడు వ్యసనాలకు డబ్బులివ్వలేదని ఈశ్వరమ్మతో గొడవ పడి సుత్తితో కొట్టడంతో చనిపోయిందని ఫిర్యాదులో తల్లి పేర్కొంది. ఈ కేసు విచారణలో సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు ఎర్రంనాయుడిని ముద్దాయిగా నిర్ధారించి తీర్పు చెప్పిందని ఎస్సై వివరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామ్ వాదనలు వినిపించగా, హెచ్‌సీలు బెడ్సన్, ప్రభాకర్ సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹85 | ₹140 | ₹150 |

# అకాల వర్షాలతో అంటువ్యాధులు

- వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- నీరు నిల్వతో వ్యాధుల వ్యాప్తి
- తీరప్రాంతంలో వైద్య శిబిరాల ఏర్పాటు

డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



కోనాడలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వర్షపు నీరు కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉంది. అదే విధంగా తాగునీరు కలుషితమయ్యే ఆస్కారం ఉంది. దీనివల్ల అంటు వ్యాధులు ప్రబలే దుస్థితి ఉంది. ఇటువంటి సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి వైద్యాధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వైద్యాధికారులు చర్యలు చేపడుతున్నారు.

**దయేరియా, టైఫాయిడ్ ప్రబలే ఆస్కారం**

ఇళ్లముందు, వీధుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. వర్షపు నీరు తాగునీటి వనరుల్లో చేరడం వల్ల నీరు కలుషితమయ్యే పరిస్థితి ఉంది. అటువంటి నీటిని తాగడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వ్యాప్తి చెందవచ్చు. అదేవిధంగా వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి అధికమవుతుంది. అవికుట్టడం వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముంది. అందువల్ల ఇంటి పరిసరాల్లోను వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

**చర్యలు చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ**

తుఫాన్ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 8 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. 24 గంటల పాటు అందుబాటులో ఉండేవిధంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. వైద్య శిబిరాల వద్ద అంటువ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచారు. వారం రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న గర్భిణులను సీహెచ్‌సీలో చేర్పించారు.

**పీహెచ్‌సీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉన్నందున పీహెచ్‌సీల సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా వ్యాధులు వ్యాప్తి చెందినట్లయితే తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి వనరుల్లో వర్షపు నీరు చేరినందున వాటర్ టెస్టింగ్ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లను డీఎంహెచ్‌ఓ భాస్కర రావు ఆదేశించారు.



కొత్తూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు వైద్యసిబ్బందిని ఆదేశించారు. తుఫాన్ అనంతర పరిస్థితుల పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ముందస్తు చర్యలు ఏ మేరకు చేపట్టారో ఆరా తీశారు. అత్యవసర మందులు యాంటీ స్నేక్ వీనం, ల్యాబ్‌లు, వ్యాక్సిన్ నిల్వలు, ప్రసూతి గదిని పరిశీలించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్, బ్యాటరీ పనితీరును పరిశీలించారు. ఓపీ నిర్వహణ రికార్డుల్లో నమోదైన రోగుల ఆరోగ్య వివరాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, డయేరియా, అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో క్లోరినేషన్, శానిటేషన్ పక్కాగా జరగాలని చెప్పారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి ప్రగతి నివేదికలో పురోగతి సాధించాలని సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు జరగాలని, పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని ఈనెల 11 నుంచి నిర్వహించనున్న మిషన్ ఇంద్రధనుస్సు టీకా కార్యక్రమానికి సూచించిన మార్గదర్శకాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. క్షయ వ్యాధి గ్రస్తులకు నెలనెలా చికిత్స, పర్యవేక్షణ ఉండాలని, చికిత్స కాలం వరకు రోగులకు ప్రతి నెలా పౌష్టికాహారానికి ప్రభుత్వం రూ.500 చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనూష, సూపర్‌వైజర్లు, వెంకటనాయుడు, శంకరరావులు పాల్గొన్నారు.

### కాచి చల్లార్చిన నీటిని తాగాలి



వర్షాలు అధికంగా కురవడం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా నూరుశాతం నీటి ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు. అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈగలు, దోమలు వాలే ఆహార పదార్థాలను తినకూడదు. ఇటువంటి వి తినడం వల్ల జిగట విరోచనాలయ్యే ప్రమాదం ఉంది. వారం రోజుల్లో ప్రసవించే అవకాశమున్న గర్భిణులను సీహెచ్‌సీలకు తరలించాం. వైద్య శిబిరాల్లో మందులు సిద్ధంగా ఉంచాం.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

## 18, 19న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ 31 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం వారు మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక సుందరయ్యభవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంఘం ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ 31 వ జిల్లా మహాసభలు డిసెంబర్ 18, 19 తేదిలలో పాలకొండ పట్టణంలో నిర్వహిస్తామన్నారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ చేసిన పోరాటాలు వాటి ఫలితాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ విద్యాభివృద్ధికి దోహదపడే విధంగా ఈ వేదిక జరగనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యారంగం అధోగతిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగం సమగ్రమైన విద్యాభివృద్ధితో ముందుకు పోవాలని, అటువంటి అభివృద్ధిలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) కృషి చేస్తుందని, భవిష్యత్తు ఉద్యమాలను, నిర్మాణాలను ఉద్ధృతంగా చేపట్టేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మహాసభల్లో జిల్లా నలుమూలల నుంచి 200 మంది ప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం పాల్గొనున్నారని, 18 న పాలకొండ పట్టణంలో ప్రదర్శన, 19 న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజు, కమిటీ సభ్యులు శివ, శారద, శ్రావణి, ఇందు పాల్గొన్నారు.

# హోంగార్డ్స్ సేవలు కీలకం



హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

- ఘనంగా 61వ ఆవిర్భావ దినోత్సవం
- పోలీస్‌శాఖకు చేస్తున్న సేవలను ప్రశంసించిన జిల్లా అదనపు ఎస్పీ



హోంగార్డులకు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందజేస్తున్న అదనపు ఎస్పీ

విజయనగరం క్రైమ్: పోలీస్ వ్యవస్థలో హోంగార్డ్స్ ఒక భాగమై పోలీసులు నిర్వహించే అన్ని రకాల విధులను నిర్వహిస్తూ, జిల్లా పోలీసుశాఖలో కీలకంగా పనిచేస్తున్నారని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. 61వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీ దేవీ దండుమారమ్మ కల్యాణ మంటపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే బందోబస్తు, ముఖ్య వ్యక్తుల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ , వివిధ విభాగాల్లో హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అంతేకాకుండా పోలీసు ఉద్యోగుల్లా హోంగార్డ్స్ కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, కంప్యూటర్ ఆపరేటర్లుగా , డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. హోంగార్డులు నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని, తద్వారా రాష్ట్ర పోలీసుశాఖకు కూడా మంచి కీర్తిని తీసుకువచ్చే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణ నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సివచ్చినప్పుడు ఒక మంచి అవకాశం లభించిందన్న నూతనోత్సాహంతో పనిచేయాలని హితవు పలికారు. హోంగార్డ్స్ సంక్షేమానికి జిల్లా ఎస్పీ, తాను కట్టుబడి ఉన్నామని, ఏ అవసరం వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభ ఉంటే ఏ స్థాయిలో పనిచేసినా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కిందిస్థాయి వ్యక్తులమన్న నిరాశ అవసరం లేదని, తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే, తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే ఏ రకమైన విధులనైనా హోంగార్డ్స్ నిర్వహించగలరన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డ్స్‌కు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలను అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ బహూకరించారు. హోంగార్డ్స్ పరేడ్ కమాండర్‌గా ఎం.శివ సంతోష్ వ్యవహరించారు. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అదనపు ఎస్పీ పావురాన్ని ఎగురవేసి, ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, వీరకుమార్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, నివేదికలను తనకు అందజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరావును కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ చేయించుకున్న ప్రతి ఒక్కరి వివరాలను తెప్పించుకుని, వాటిని పరిశీలించాలని చెప్పారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ పక్రియం చట్టం 1994 అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం బుధవారం సాయింత్రం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి స్కానింగ్ సెంటర్ల తనిఖీలు, నివేదికల పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రోగ్రాం అధికారులకు నిర్ణీత గడువు విధించి, తమ పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయించాలని ఆదేశించారు. స్కానింగ్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి బిల్లు ఇచ్చే విధంగా చూడాలని, రిజిస్టర్లను పరిశీలించాలని చెప్పారు. గర్భస్థ లింగ నిర్ధారణ వెల్లడి నేరమన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీఐఓ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటేశ్వరావు, దిశ డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, పీపీ జయలక్ష్మి, నేచర్ సంస్థ కో ఆర్డినేటర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

**గెస్ట్ లెక్చరర్స్‌ను నియమించాలి**

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఐటీఐ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్స్‌ను నియమించి తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. పోస్టుల ఖాళీల వల్ల ఏ సబ్జెక్టులో కూడా ఉపాధ్యాయులు లేకుండా ఉండకూడదని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి మంజూరు కావలసిన పనులు, రావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో గుర్తించిన లోపాలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘం నుంచి కలెక్టర్‌కు వినతి ప్రత్రం అందజేశారు. ఈ మేరకు ఆయా కళాశాలల ఉన్నతాధికారులతో బుధవారం ఆమె తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి, జిల్లా బీసీవెల్ఫేర్ అధికారి కె.సందీప్ కుమార్, డీవీఈఓ భీమ శంకరరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామానందం, ప్రభుత్వ ఐటీఐ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాలకు ఆరోగ్య భరోసా



ఈ తరహా మూగజీవాలకు ఆరోగ్య రక్షణ

- పాడిపశువులకు హెల్త్ కార్డులు
- ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు పంపిణీ

పాలకొండ రూరల్: వ్యవసాయంతో సమానంగా పాడి రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పశువుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక హెల్త్ కార్డులు అందజేస్తోంది. వ్యవసాయ ఆధారితమైన పార్వతీపురం మన్యం జిల్లాలో సాధారణ రైతులతో పాటు గిరిజన రైతులు ప్రస్తుతం పాడిరంగంపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో పశుసంవర్ధక శాఖ నేతృత్వంలో మూగజీవాల రక్షణకు సర్కారు పెద్దపీట వేసింది. పశునష్టపరిహార పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి మరణించిన పశువులకు పరిహారం చెల్లించనుంది. డాక్టర్ వైఎస్సార్ పశు బీమా ద్వారా అన్ని రకాల జీవాలు, పశువులకు బీమా చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. పాడి సంపద కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి యానిమల్ హెల్త్ కార్డు అందించేలా యంత్రాంగం ప్రణాళికతో ముందుకు వెళ్తోందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**కార్డులో వివరాల నమోదు**

పశువులు, జీవాలకు వేసే వ్యాధినిరోధక టీకా, నట్టల నివారణ మందుల వివరాలు ఈ హెల్త్ కార్డుల్లో నమోదు చేస్తారు. వైఎస్సార్ పశు బీమా పథక వివరాలను, సంబంధిత పశు సంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ఈ కార్డుల్లో పేర్కొంటారు. అత్యవసర అనారోగ్య పరిస్థితిలో వైద్యులను సంప్రదించేందుకు టోల్ ఫ్రీ నంబర్లు ఇందులో ఉంటాయి. పెద్ద పశువులు, జీవాలకు వేరువేరుగా కార్డులు అందించడంతో పాటు వాటి పూర్తి వివరాలు నమోదు చేస్తారు. వాటికి అందిస్తున్న వైద్యసేవలు, వాడుతున్న మందుల వివరాలు యానిమల్ హెల్త్ కార్డుల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**కార్డుల జారీ ఇలా..**

పశుగణన ఆధారంగా జిల్లాలో ఆవులు 2,28,681, గేదెలు 46,017, గొర్రెలు 1,73,110, మేకలు 2,07,451, పందులు 5089, కోళ్లు 8,46,060 ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. వాటిని కలిగి ఉన్న 56 వేల 908 కుటుంబాలకు యానిమల్ హెల్త్ కార్డులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆరు పెద్ద పశువులకు ఒక హెల్త్ కార్డు జారీ చేస్తారు. ఈ నేపథ్యంలో 15 పశువులు కలిగి ఉంటే మూడు కార్డులు అందిస్తారు. 20 గొర్రెలు, మేకలకు ఒక కార్డు వంతున అందించేలా చర్యలు చేపట్టారు. యానిమల్ హెల్త్ కార్డు ఆవశ్యకతపై వైద్యులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. 6 నెలలు ఆపై వయసు కలిగిన గొర్రెలు, మేకలను సాకుతూ రైస్ కార్డు ఉన్న పాడిరైతు కుటుంబానికి 80 శాతం రాయితీతో బీమా అందించనున్నారు. మృతి చెందిన ఒక్కో జీవానికి రూ.6వేలు నష్ట పరిహారం చెల్లిస్తారు. ఒకటిన్నర ఏడాది వయసు పైబడిన మేలుజాతి పశువులకు ఒక్కోదానికి రూ.30వేలు, రెండు సంవత్సరాలు పైబడిన పశువులకు రూ.15వేలు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

### పాడి రైతులకు ఎంతో మేలు



యానిమల్ హెల్త్ కార్డులతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఒక కుటుంబంలో రెండు పశువులు ఉన్నా కార్డు మంజూరు చేస్తాం. క్షేత్రస్థాయిలో మా సిబ్బంది అర్హులైన పాడి పెంపకందారులను గుర్తించి వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసి హెల్త్ కార్డులు అందిస్తారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగనుంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా కార్డులు అందించేలా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకూ 236 ఆర్‌బీకేల పరిధిలో 56వేలకుపైబడి పాడిరైతు కుటుంబాలను గుర్తించాం. 7,631 కుటుంబాలకు చెందిన 10,643 మందికి పాడిరైతులకు హెల్త్ కార్డులు అందించాం.

ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు, పాలకొండ